క్లుప్తంగా

నేడు సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభం

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ ఎం.శిఖామణి, ఎంపీటీసీ తిరుపతి రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వెన్నా ఇందిరా హనుమారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని, పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ


మాట్లాడుతున్న ఉమాదేవి

దొనకొండ: విద్య, వైద్యం, పశుసంపద, వ్యవసాయం, నీటి పారుదల వంటివి గ్రామంలో అందుబాటులో ఉన్నప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమని రిలయన్స్ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ ఉమాదేవి తెలిపారు. మండలంలోని చందవరం పంచాయతీ సచివాలయంలో శుక్రవారం ఎఫర్ట్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉమాదేవి మాట్లాడుతూ గ్రామంలోని వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, కార్యదర్శి శేషమ్మ, ఎఫర్ట్ సంస్థ టీమ్ జెస్సీగ్లోరీ, నాసరమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో నీటి యాజమాన్యం అవసరం

తాళ్లూరు (ముండ్లమూరు): మొక్కజొన్న సాగు చేసిన రైతులు నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని విఠలాపురంలో క్షేత్ర పర్యటనలో భాగంగా మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో 1093 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు చెప్పారు. పైరుకు ఉదయం వేళ ఆకులు చుట్టుకున్నట్లు కనిపిస్తే నీటి అవసరం ఉన్నట్లు భావించి తడి ఇవ్వాలన్నారు. వర్షపాతం, నేలలు, పంట పరిస్థితులను బట్టి నీటితడులు ఇవ్వాలన్నారు. ఆయన వెంట వీఏఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

బాలుడి గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన ఆటోడ్రైవర్ రాజేష్ తిరుపతమ్మ దంపతుల కుమారుడు వాసు అనే బాలుడి గుండె ఆపరేషన్ కోసం గ్రీన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, మధుసూధన రెడ్డి, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

యద్దనపూడి: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించి మంచి దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు సూచించారు. శుక్రవారం మండలంలోని పూనూరు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనజీవామృతం, ద్రవజీవామృతం, పంటల్లో రసం పీల్చు పురుగుల నివారణకు నీమాస్త్రం ఏ విధంగా తయారు చేసుకోవాలో, ఏవిధంగా పిచికారి చేయాలి అన్న విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎల్‌టూ వెంకటరత్నం, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ బ్లడ్ బ్యాంకు చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు ప్రోత్సాహంతో 421 రక్తదానం నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణి కన్నెబోయిన సునీతకు ఓ పాజిటివ్ రక్తం అవసరమని డాక్టర్ సూచించారు. అద్దంకికి చెందిన కనపర్తి స్వాములు రక్తదానం చేశారు. రక్తదాతకు గర్భిణి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ పూర్వ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టమీద మొక్కలు, ట్రీ గార్డ్స్ ఏర్పాటు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో నూతలపాడు గ్రామం చెరువు కట్టమీద పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి, ట్రీ గార్డులు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకర్లపూడి చెన్నయ్య మాట్లాడుతూ చెట్లను పరిరక్షించే బాధ్యతను పంచాయతీ తరపున నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి భీమనేని హరిప్రసాద్, క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మార్కాపురంలో విద్యాలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు


గొట్లగట్టు రామాలయంలో..


పెదారికట్లలో..


రాజంపల్లిలో ప్రత్యేక అలంకరణలో విజయలక్ష్మి అమ్మవారు


గిద్దలూరు: అమ్మవారిశాలలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం

విజయలక్ష్మి అలంకరణలో..

పెద్దారవీడు: విజయదశమి శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని మండలంలో రాజంపల్లెలో వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, కూరగాయల మాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు ఏనుగులదిన్నెపాడు గ్రామానికి చెందిన ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, గోపాలుని నాగప్రదీప్, శ్రీహర్ష దంపతులు వ్యవహరించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

పెద్దదోర్నాల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారిశాలలో అమ్మవారిని శుక్రవారం సరస్వతీదేవిగా అలంకరించారు. సరస్వతీదేవి జన్మనక్షత్రం అయిన మూల నక్షత్రం సందర్భంగా పలు దేవాలయాల్లో సామూహిక అక్షరభ్యాసాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు బీ రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు.

జ్ఞానసరస్వతీదేవిగా ఈశ్వరీమహాదేవి

దొనకొండ: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక ఆనందాశ్రమంలో శుక్రవారం 6వ రోజు జ్ఞానసరస్వతీదేవిగా ఈశ్వరీమహాదేవి దర్శనమిచ్చారు. శనివారం రాజరాజేశ్వరిగా దర్శనమివ్వనున్నట్లు భైరవానందస్వామి తెలిపారు.

మార్కాపురం/మార్కాపురం టౌన్: దసరా శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మిగా, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత సరస్వతీదేవిగా, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు విద్యాలక్ష్మిగా, బంగారమ్మ దేవాలయంలో మహా సరస్వతీదేవిగా, మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబదేవి అమ్మవారు కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా సామూహిక అక్షరాభ్యాసం

మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం మార్కాపురం శివాలయంలోని అమ్మవారి సన్నిధిలో అర్చకులు ఆంజనేయశర్మ, తేజ, ప్రకాష్ శర్మ చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి ఎదుట ఆలయ అర్చకులు అరుణ్ శర్మ చిన్నారులతో అక్షరాభాస్యం చేయించి సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆర్.రామారావు, కోశాధికారి నిట్టూరి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.


అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం ,కొనకనమిట్ల రామదూతక్షేత్రం, పెదారికట్ల శివాలయం, మహాలక్ష్మమ్మాలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామిఆలయాల్లోఅమ్మవారినిసరస్వతీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కురిచేడులో...

కురిచేడు: స్థానిక జ్ఞానప్రసూనాంబ, వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవార్లు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

దర్శిలో...

దర్శి: స్థానిక కనకదుర్గాభవాని అమ్మవారు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలు అందుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.


దొనకొండలోని ఆనందాశ్రమంలో జ్ఞానసరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు


కంభంలో పార్వతీదేవి అలంకరణలో..


కురిచేడులో సరస్వతీదేవి అలంకరణలో జ్ఞానప్రసూనాంబ


కురిచేడులో సరస్వతీదేవి అలంకరణలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవి

జగనన్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


పిడికిటివానిపల్లి ఆరోగ్య శిబిరంలో కేస్ షీట్ అందచేస్తున్న జిల్లా మలేరియా నివారణాధికారి జ్ఞానశ్రీ.


పెద్దవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు


కొండేపల్లిలో కళ్లజోడు అందచేస్తున్న ఎంపీడీఓ చందన, కొండారెడ్డి

పుల్లలచెరువు: గ్రామాల్లోని పేద, సామాన్య కుటుంబాలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా నివారణాధికారి జ్ఞానశ్రీ అన్నారు. శుక్రవారం మండలంలోని పిడికిటివానిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీడీవో సాయికుమార్‌తో కలిసి శిబిరంలో ఏర్పాటు చేసిన వాటిని పరిశీలించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, సర్పంచ్ మస్తాన్ రెడ్డి, తహశీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్‌బాబు, డాక్టర్లు శంకర్‌నాయక్, రవి నాయక్, ఎంఈవో ఇందిరప్రసాద్, కార్యదర్శులు అంజిరెడ్డి, నాయక్, సచివాలయ మండల కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌ఓ వాసు ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శి నాయక్ అధ్యక్షతన డాక్టర్ల బృందాన్ని, అధికారులను ఘనంగా సన్మానించారు.

ఉచితంగా ఖరీదైన వైద్యం

కురిచేడు: రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ ఉచితంగా ఖరీదైన వైద్యం అందించి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా 20 రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని పెద్దవరం గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు సుమారు 4 వేలకుపైగా ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టని కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి చేపడుతున్నారన్నారు. అనంతరం పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి పీ ప్రవీణ్, ఎంపీడీఓ బీ శంకరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, మండల సచివాలయాల కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ మార్లెళ్ల నరసమ్మ, ఎంపీటీసీ సోమవరపు అంకారావు, తహసీల్దార్ ఎం.జ్వాలానరసింహం, నాయకులు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెదన్నపాలెంలో...

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, జెడ్పీటీసీ ఎం.సుధాకర్, తహసీల్దార్ ఎం.సువర్ణ, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ పాల్గొన్నారు. ఐసీడీఎస్ వారు తయారు చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలించారు. వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ గుంటు పోలయ్య, సర్పంచ్ మిండాల మంగమ్మ, ఎంపీటీసీ కసిబిసి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి యల్లాబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి జగనన్న భరోసా

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాహుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు హాజరయ్యారు. ప్రజల ఆరోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కమిషనర్ గిరికుమార్, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, స్పెషలిస్టు వైద్యులు, వైద్య, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తోట చందన, ఎంపీటీసీ కుందురు మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం కొండేపల్లిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో తిప్పాయపాలెం మెడికల్ ఆఫీసర్ హిమబిందు, ఇతర వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నేత కుందురు చిన్న కొండారెడ్డి, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి ప్రారంభించారు. ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ప్రభుత్వ వైద్యులు బాలయ్య, నరేంద్ర కుమార్, పృథ్వీరాజ్, సురేఖ, గైనకాలిజిస్టులు వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ షాజిదా, సూపర్‌వైజర్ సరిత, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


మార్కాపురంలో మాట్లాడుతున్న డాక్టర్ రాహుల్


వెలిగండ్లలో పౌష్టికాహార ప్రదర్శన

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం భద్రత

గిద్దలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత లభిస్తుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. శుక్రవారం ఉయ్యాలవాడలో వైద్య ఇంటింటా సర్వే నిర్వహించారు. డాక్టర్లు రసూల్, సుమన్, మానస, దివ్య, గ్రామ సర్పంచి జంపార భాస్కర్‌రావు, ఈఓఆర్డీ చెన్నారావు పాల్గొన్నారు.


పెదన్నపాలెంలో వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎంపీపీ, సర్పంచ్


ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న ఎంపీపీ

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ

పొదిలి: స్థానిక నేతపాలెం అంగన్‌వాడీ కేంద్రాలకు లాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుర్చీలు బహూకరించారు. లాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అల్‌మొమిన్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకులు మహమ్మద్ ఖయ్యూం మూడో వర్ధంతి సందర్భంగా కుర్చీలను బహూకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, సీడీపీఓ సుధమారుతి, సూపర్‌వైజర్లు సుభాషిణి, సావిత్రి, సరిత, మానవత స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షులు బండి అశోక్, హజరత్ తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న నిర్వాహకులు

నేడు ఉప్పలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మండలంలోని ఉప్పలపాడులో శనివారం 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాపతినిధులు, సచివాలయం సిబ్బంది, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం కన్వీనర్ వి.రామక్రిష్ణ శుక్రవారం డీటీ సుబ్బారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా వారికి వ్యవసాయంలో చేయూతను అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు రావి క్రిష్టారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, సీహెచ్ రమణ పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందచేస్తున్న కల్లం వెంకట సుబ్బారెడ్డి

పొదిలి: స్థానిక బాప్టిస్టపాలేనికి చెందిన పాస్టర్, పెయింటర్ అయిన రాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని మానవత స్వచ్ఛంద సంస్థ కార్యవర్గ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. రాజు ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందచేశారు. సంస్థ చైర్మన్ మువ్వల పార్థసారథి, అధ్యక్షులు కల్లం వెంకట సుబ్బారెడ్డి, కన్వీనర్ యల్లమందారెడ్డి, డైరెక్టర్లు ధర్నాసి రామారావు, జి.శ్రీనివాసులు, కార్యదర్శి వెంకటరావు, ఉపాధ్యక్షులు బండి అశోక్, జాయింట్ సెక్రటరీ సుమంత్, వేల్పుల దాసు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణారెడ్డి

దర్శి: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన కైపు వెంకట కృష్ణారెడ్డిని నియమిస్తూ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివార్జున్ శుక్రవారం నియామకపత్రం అందజేశారు. పదవి ఇచ్చిన వారికి కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.